నేటి నుంచి పది పరీక్షలు

- హాజరుకానున్న 40,063 మంది విద్యార్థులు
- 142 కేంద్రాలు సిద్ధం
- 142 మంది సీఎస్, డీఓలు, 1670 మంది ఇన్విజిలేటర్ల నియామకం
- 7 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పర్యవేక్షణ
- ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులకు ఉచిత ప్రయాణం
- అన్ని ఏర్పాట్లు చేశాం : డీఈఓ వరలక్ష్మి



అనంతపురంలోని శారదా స్కూల్ పరీక్షా కేంద్రంలో తమ హాల్‌టికెట్ నంబర్లు చెక్ చేసుకుంటున్న విద్యార్థులు

అనంతపురం విద్య, మార్చి 17 : పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 40,063 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలకు 142 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయి. నిర్ణీత తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలకు జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 142 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఇందులో పోలీస్‌స్టేషన్, ట్రెజరీ సదుపాయం ఉన్న ఏ సెంటర్లు 104, కేవలం పోలీస్‌స్టేషన్ సదుపాయం ఉన్న బీ సెంటర్లు 38 ఉన్నాయి. ఈ 142 కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్లు 142 మందిని, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు 142 మందిని నియమించారు. ఇన్విజిలేటర్లుగా 1670 మందిని, 7 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించింది. విద్యార్థులు హాల్‌టికెట్లను చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ మేరకు డీఈఓ వరలక్ష్మి సైతం ఆర్టీసీ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. హాల్ టికెట్లను స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్లు పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్(డీజీఈ) దేవానందరెడ్డి వెల్లడించారు. హాల్‌టికెట్లపై స్కూల్ ప్రధానోపాధ్యాయుల సంతకం లేకున్నా అనుమతించాలని ఉత్తర్వులు ఇచ్చారు. పరీక్షలు పకడ్బందీగా, సజావు గా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. కేంద్రాల్లో నీటి సదుపాయంతోపాటు, వైద్యసేవలు కూడా అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులతో మాట్లాడామన్నారు. తప్పనసరి అయితేనే విద్యార్థులకు 15 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా... గ్రేస్ టైంతో అనుమతిస్తామన్నారు.

అన్ని కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్

సెల్‌ఫోన్లకు అనుమతిలేదు

40 నిమిషాల తర్వాత ఒక్కసారి మాత్రమే సెల్‌ఫోన్ వాడాలి

ఆర్‌జేడీ, జిల్లా పరీక్షల పరిశీలకుడు రాఘవరెడ్డి



డీఈఓ, ఏసీతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

అనంతపురం విద్య, మార్చి 17 : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అన్ని కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్టు ఆర్‌జేడీ, జిల్లా పరీక్షల పరిశీలకుడు రాఘవరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదన్నారు. ఆఖరికి పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్) సైతం పోలీసుల వద్ద ఉంచి వెళ్లాలని, పరీక్షలు మొదలైన 40 నిమిషాల తర్వాత మాత్రం హాజరు వివరాలు తెలియజేసేందుకు ఒక్కసారి మాత్రమే సెల్ ఫోన్ వాడుకోవచ్చునని, తర్వాత అక్కడే డిపాజిట్ చేసి వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఆదివారం ఆయన డీఈఓ కార్యాలయంలో డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్‌తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ మండల విద్యాశాఖాధికారులను మండల పరీక్షల అధికారులుగా నియమించి, వారికి అదనపు అధికారాలు ఇచ్చామన్నారు. ఏ అధికారీ సెల్‌పోన్‌తో వెళ్లడానికి లేదన్నారు. తాను కూడా బయటే సెల్‌పోన్ ఉంచి వెళ్తానని తెలిపారు.

ప్రహసనంగా పరీక్షల విధులు


ఒక టీచర్‌కు రెండు కేంద్రాలు..!

అధికారుల మధ్య సమన్వయం ఏదీ...?

డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఏసీల మధ్య అంతరం

అడ్డగోలుగా నియామకాలు

సాయంత్రం వరకూ 'మార్పు' ఉత్తర్వులు



ఒకే టీచర్‌కు రెండు కేంద్రాల్లో డ్యూటీ వేస్తూ ఉత్తర్వు

అనంతపురం విద్య, మార్చి 17 : జిల్లా విద్యాశాఖలో ఇష్టారాజ్యం రాజ్యమేలుతోంది. పదో తరగతిలో ఇన్విజిలేటర్ల నియామకం అడ్డగోలుగా చేస్తున్నారు. కళ్లు మూసుకుని వేస్తున్నారన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఒక టీచర్‌ను పరీక్షల డ్యూటీ వేస్తే...ఒక సెంటర్‌కు వేస్తారు... కానీ ఇక్కడి అధికారులు ఏకంగా రెండు కేంద్రాల్లో డ్యూటీ వేశారు. సోమవారం ఉదయం పరీక్షలు ఉంటే.. ఆదివారం సాయంత్రం వరకూ కూడా ఇన్విజిలేటర్ల డ్యూటీలు వేశారు. దీంతో సీఎస్‌లు, డీఓలు తలలు పట్టుకుంటున్నారు. పరీక్షల డ్యూటీలు వేయడం ప్రహసనంగా మారింది. అనంతపురం డిప్యూటీ డీఈఓ కార్యాలయం, అసిస్టెంట్ కమిషనర్, డీఈఓ మధ్య సమన్వయం లేకపోవడమేనని ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకే టీచర్‌కు రెండు కేంద్రాలకు డ్యూటీలు వేయడం చూస్తుంటే పరీక్షలపై అధికారుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది. కళ్యాణదుర్గం మండలంలో పనిచేసే ఓ స్కూల్ అసిస్టెంట్‌ను అనంతపురం నగరంలోని నేతాజీ స్కూల్‌లోని పరీక్షా కేంద్రానికి అడిషనల్ డిపార్టుమెంటల్ ఆఫీసర్(ఏడీఓ)గా నియమించారు. మళ్లీ ఆయననే నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉన్న పరీక్షా కేంద్రానికి సైతం ఏడీఓగా నియమించారు. పరీక్షా కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలోని ఉపాధ్యాయులను పరీక్షల డ్యూటీకి వేయాలన్నది నిబంధన. ఒక వేళ ఆ పరిధిలో ఎవరూ టీచర్లు లేకున్నా..సమీప మండలాల్లోని టీచర్లను నియమించాలి. ఉరవకొండ, గుంతకల్లు వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా టీచర్లను వేయడం విమర్శలకు తావిస్తోంది.

పర్యవేక్షణ లోపిస్తే మొదటికే మోసం

జిల్లా వ్యాప్తంగా 142 పరీక్షా కేంద్రాలకు 142 మంది చొప్పున సీఎస్, డీఓలను నియమించారు. 1670 మంది వరకూ ఇన్విజిలేటర్లను నియమించినట్లు అధికారులు చెబుతున్నారు. పరీక్షల పరిశీలకుడు, ఆర్‌జేడీ రాఘవరెడ్డి, డీఈఓ వరలక్ష్మి పరీక్షల విధులు, ఇతర విషయాలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయకుంటే మొదటికే మోసం రావడం ఖాయమన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో ఉన్న ఓ డీఈఓ ఒకే అధికారిపై అతి నమ్మకం పెట్టుకుని వదిలేయడంతో ఇష్టారాజ్యంగా డ్యూటీలు వేశారు. చివరికి ఇబ్బందులు పాలయ్యారు.



వామ్మో అన్ని రోజులా!

సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. మార్చి ఆఖరులో నోటిఫికేషన్ విడుదల చేస్తారని, ఏప్రిల్ రెండో వారం లేదా మూడో వారంలోనే ఎన్నికలు జరుగుతాయని అభ్యర్థులు లోలోన లెక్కలేసుకున్నారు. 20 రోజుల్లోనే ఎన్నికలు ముగుస్తాయి, ప్రచార ఖర్చులు తగ్గుతాయని అనుకున్నారు. డామిట్.. కథ అడ్డం తిరిగింది అన్న చందంగా... కేంద్ర ఎన్నికల సంఘం అభ్యర్థుల అంచనాలను తలకిందులు చేసే విధంగా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో వారిలో అలజడికి దారితీసింది.



అభ్యర్థుల్లో అలజడి

- ఖర్చులపై లెక్కలేసుకుంటున్న వైనం
- ద్వితీయశ్రేణి నాయకుల్లోనూ అదే భయం
- అధికారులకూ పరీక్షే...



అనంతపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు ఏకంగా 58 రోజులు గడువు విధించడంతో అభ్యర్థుల పరిస్థితి దయనీయంగా మారింది. ద్వితీయశ్రేణి నాయకత్వంలోనూ అదే భయం వెంటాడుతోంది. నెలరోజుల్లో ముగియాల్సిన ఎన్నికల ప్రక్రియ ఏకంగా దాదాపు రెండు నెలల పాటు కొనసాగుతుండటంతో ప్రచార ఖర్చులపై అభ్యర్థులు ఎవరికి వారు లెక్కలేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. పార్టీ అధిష్టానాలను మెప్పించి ఒప్పించి అతికష్టం మీద అభ్యర్థిత్వాలను ఖరారు చేయించుకుని ఉత్సాహంతో ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్‌తో వారి ఉత్సాహాన్ని నీరుగార్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మే 13న ఎన్నికలు, జూన్ 4న కౌంటింగ్ అని కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో అభ్యర్థుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఫలానా తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని సమాచారంతో అభ్యర్థులు ఆనందపడ్డారు. ఎన్నాళ్లో వేచిన ఉదయం ఈనాడే వచ్చిందంటూ కాసేపు సంబరాల్లో మునిగితేలారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల తరువాత తెల్లమొహాలు వేయాల్సి వచ్చింది.

ఇదిలా ఉండగా.... టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల కంటే.. అధికార వైసీపీ అభ్యర్థుల్లోనే ఎన్నికల షెడ్యూల్ మరింత అలజడికి కారణమవుతోంది. అభ్యర్థిత్వం ఖరారు కాకముందు... టిక్కెట్ వస్తుందో రాదోనని ఆందోళనతో కాలం నెట్టుకుంటూ వచ్చారు. టిక్కెట్ తమకే వస్తుందనే అధికార వైసీపీ నాయకులు ముందుగానే ఓటర్లకు తాయిళాలు పంచిపెట్టారు. దీంతో ఓటర్లంతా తమ గుప్పిట్లోనే ఉన్నారనే భరోసాతో ఉన్నారు. రెండు నెలలపాటు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో ఓటర్లు ఎక్కడ చేజారిపోతారోనన్న అభద్రతాభావాన్ని అధికార వైసీపీ అభ్యర్థులను వెంటాడుతోంది. రెండు నెలలకు ముందే ఇచ్చిన తాయిళాలు ఓట్ల రూపంలో రాలుతాయో లేదోననే గుబులు ఆ వర్గాల్లో నెలకొంది. ప్రచారానికి కావాల్సినంత సమయం దొరికిందని అనుకోవడం కన్నా.. రెండు నెలల పాటు ప్రచార పోరాటాన్ని నిరంతరాయంగా కొనసాగించాలన్న వేదన అభ్యర్థులను అతలాకుతలం చేస్తోంది. ఈ పరిణామాలన్నీ ఒకెత్తయితే... ఈ ఎన్నికల సుదీర్ఘ ప్రక్రియ అధికారులకు అగ్ని పరీక్షగానే మారనుందనడంలో సందేహం లేదు. ఎన్నికల నియమావళి మేరకు అభ్యర్థులు ఖర్చు చేస్తున్నారా..? లేదా అనేది క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉంది. దాదాపు రెండు నెలల పాటు అభ్యర్థుల ప్రచారం కొనసాగుతున్న నేపథ్యంలో... ఖర్చుల లెక్కలు ఏ మేరకు గణన చేయాలోనన్న అయోమయంలో కొట్టుమిట్టాడే పరిస్థితిని ఆ వర్గాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎన్నికల నిబంధనలు ఏ మేరకు అటు అభ్యర్థులు... ఇటు అధికారులు అమలు పరుస్తారో చూడాలి.

ఖర్చులపై లెక్కలేసుకుంటున్న వైనం



గత సార్వత్రిక ఎన్నికలు తొలిదశలోనే జరగడంతో నెలరోజుల వ్యవధిలోనే ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుత ఎన్నికల ప్రక్రియకు దాదాపు రెండు నెలల సమయం ఉండటంతో నిరంతర ప్రచారాన్ని కొనసాగించాల్సిన పరిస్థితిని అభ్యర్థులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అంటే ఓటరును రెండు నెలల పాటు ప్రసన్నం చేసుకోవాల్సిన అవసరం అభ్యర్థులది. ఎన్నికల సంఘం నియమావళి మేరకు ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థి రూ. 38 లక్షలకు మించి ఖర్చు చేయకూడదు. ఎంపీ అభ్యర్థులకు మూడు రెట్లు ఎక్కువ. ఇక్కడే అభ్యర్థులు ఖర్చుల విషయంలో లెక్కలేసుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రెండు నెలల పాటు ప్రచారం చేయాల్సిన క్రమంలో రోజుకు ఎంత ఖర్చు చేయాలి..? ఎన్నికల సంఘానికి ఎంత ఖర్చు చూపించాలనే విషయంపైనే ఎక్కువగా దృష్టి సారించినట్లు సమాచారం. ఖర్చుల లెక్కలపైనే కుస్తీ పడుతున్నారు. రెండు నెలల పాటు ప్రచారం కొనసాగించాలనేది అత్యంత ఆర్థికంతో కూడుకున్న వ్యవహారం అనడంలో సందేహం లేదు. అంచనాల కంటే మించి నోట్ల కట్టలు బయటకు తీయాల్సిన పరిస్థితి అభ్యర్థులది. దీంతో ఖర్చు తడిసి మోపెడవడం ఖాయమని స్పష్టంగా అర్థమవుతోంది. ఇక్కడే అభ్యర్థులు ఆర్థిక విషయంలో తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. పోటీలో ఉన్నప్పుడు ప్రత్యర్థికి దీటుగా ఖర్చు చేయాల్సి రావడంతో అభ్యర్థుల పరిస్థితి అటు నుయ్యి.. ఇటు గొయ్యి అన్న చందంగా మారింది.

ద్వితీయశ్రేణి నాయకుల్లోనూ అదే భయం



టీడీపీ కూటమి, వైసీపీలోని ద్వితీయశ్రేణి నాయకత్వంలోనూ ఎన్నికల షెడ్యూల్ ఫీవర్ పట్టుకుంది. ముఖ్య నాయకులు పోటీలో ఉండటంతో... ప్రచారానికి జనాన్ని సమీకరించే విషయంలో ద్వితీయశ్రేణి నాయకత్వానిదే ప్రముఖ పాత్ర. రెండు నెలల పాటు ప్రచారం కొనసాగుతుండటంతో ప్రచారానికి జనాన్ని సమీకరించేందుకు ఆర్థికమూలాలు అవసరం. ఇక్కడే ద్వితీయశ్రేణి నాయకత్వం ఆందోళనకు గురవుతోంది. 55 రోజుల పాటు ప్రచారంలో ఉండటమంటే అంత ఆషామాషీ కాదనే అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది. అధికారంలో ఉన్నప్పుడు పలుకరింపులు తప్పా.. ఆర్థిక చేయూతకు తోడ్పాటునందించకపోవడంతో వైసీపీలోని ద్వితీయశ్రేణి నాయకత్వం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తోందని తెలుస్తోంది. ఈ పరిణామాలు వైసీపీ అభ్యర్థులకు కంఠకంగా మారాయి.

కోడ్ కూసినా మేల్కోరా..?



బెళుగుప్ప గ్రామ సచివాలయ భవనంపై సీఎం జగన్ చిత్రం



ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు తొలగించని వైసీపీ జెండా

కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం సాయంత్రం ప్రకటించింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 24 గంటలు దాటినా అధికారుల్లో మాత్రం నిర్లక్ష్యం అలుముకుంది. ప్రభుత్వ వాహనాలు, ఆస్తులపై రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల చిత్రాలు ఉండకూడదని నిబంధన ఉన్నప్పటికీ వాటిని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు జిల్లాలోని పలుచోట్ల ఇంకా అధికార పార్టీ ఫ్లెక్సీలు, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చిత్రాలు యథేచ్ఛగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు అన్ని రకాల ప్రభుత్వ భవనాలపై జగన్ బొమ్మలు ముద్రించడంతో వాటికి రంగులు వేయాల్సి ఉంది. అధికారులు వీటి కోసం మరెంత సమయం తీసుకుంటారో చూడాలి.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలలో సీఎం ఫొటోతో ప్రాణవాయువు బోర్డు



యాడికి మండలం రాయలచెరువులో వైసీపీ సిద్ధం ఫ్లెక్సీ

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

రూ. 50వేలకు పైగా నగదు, రూ.10వేల కంటే విలువైన వస్తు రవాణా నిషిద్ధం

ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, మార్చి 17 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్పీ అన్బురాజన్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా ఎస్పీ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు, రాజకీయ పార్టీల కార్యకర్తలు రూ.50వేలకు మించి నగదు, రూ.10వేల కన్నా ఎక్కువ విలువైన వస్తువులను రవాణా చేయటం నిషిద్ధమన్నారు. జిల్లాలో ప్రశాంత, పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యమని, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ మేరకు సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎన్నికల కృషి ప్రవర్తనా నియమావళిని అందరూ తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి అభ్యర్థి, రాజకీయ పార్టీ ప్రతినిధి, ప్రశాంత వాతావరణానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా ప్రవర్తించాలన్నారు. సభలు, సమావేశాలు, వాహనాలు అన్ని ముందస్తు అనుమతి పొంది నిర్వహించుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, పాటించకపోయినా చర్యలు తప్పవని పేర్కొన్నారు. కుల, మత ప్రాంతీయ పరమైన విద్వేషాలు చేయడం, రెచ్చగొట్టేలా రాజకీయ నేతలు ప్రవర్తించకూడదన్నారు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థన స్థలాలు, విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదన్నారు. అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేయడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం చేయకూడదని సూచించారు. ఎన్నికల ప్రచారానికి వినియోగించే ప్రతి వాహనానికి ఎన్నికల నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవాలన్నారు. పార్టీల స్టార్ క్యాంపెయినర్లు రూ.లక్షకు మించి నగదు కలిగి ఉండకూడదన్నారు. పరిమితికి మించి నగదు రవాణా చేస్తున్న వాహనాలను సైతం ఆ నగదుతో పాటే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా అడ్డపల్లకి ఉత్సవం



అడ్డపల్లకిలో పీఠాధిపతిని ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఫిబ్రవరి 17: పట్టణంలోని గవిమఠంస్థిత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అడ్డపల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా వెలిగొండ రోడ్డు వద్ద ఉన్న మఠం నుంచి పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్ర స్వామికి స్వాగతం పలుకుతూ పల్లకిలో ఊరేగించారు. శనివారం రాత్రి బూదగవి వద్ద విడిది చేసిన పీఠాధిపతిని ఆదివారం వెలిగొండ రోడ్డులోని మఠానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. మఠంలో పీఠాధిపతికి పాదపూజ చేశారు. భక్తులు పూజ సామాగ్రిని పీఠాధిపతికి సమర్పించారు. గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ పీఠాధిపతికి గండపెండేరం తొడిగారు. అనంతరం పట్టణంలోని వీధుల గుండా అడ్డపల్లకి ఉత్సవం కొనసాగింది. కోలాటాలు, విన్యాసాలు, కళాకారుల తాండావాలు, వేషధారణ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అడ్డపల్లకి ఉత్సవం కన్నుల పండువగా సాగింది. వడ్డెర సేవాసమితి ఆధ్వర్యంలో పల్లకి ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తరాధికారి కరిబసవరాజేంద్ర స్వామి, ఆదోని చౌకిమఠం కల్యాణ్‌స్వామి, గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంటు రాజన్నగౌడ్, సిబ్బంది నారాయణస్వామి, మధు, వెంకటేష్, రఘు భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక ఆకర్షణగా గజలక్ష్మి

పట్టణంలోని గవి మఠం ఉత్సవాల్లో గజలక్ష్మి (ఏనుగు) ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి వినతి మేరకు 1998లో కర్ణాటక ప్రభుత్వం ఈ ఏనుగును మఠానికి కేటాయించింది. 26 ఏళ్ల నుంచి మఠం ఉత్సవాల్లో పాల్గొంటోంది. ఉత్సవాలు ప్రారంభం నుంచి గజలక్ష్మిని ముందు ఉంచడం అనవాయితీగా వస్తోంది. ప్రజలు ఏనుగును చూడటానికి, తినుబండారులు అందించడానికి ఆసక్తి చూపారు.

వలంటీర్లు విరుద్ధంగా వ్యవహరిస్తే

వేటు వేయండి

ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయండి

ఎన్నికల విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులపై చర్యలు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశం




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టరు గౌతమి, జేసీ, జడ్పీ సీఈఓ తదితరులు

అనంతపురంటౌన్, మార్చి 17 : ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ప్రచారాలు, కార్యక్రమాల్లో పాల్గొనే వలంటీర్లపై వేటు వేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో తక్షణమే నియమావళిని పటిష్టంగా అమలుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు తెలియజేశారు. ఆదివారం ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఈ సమావేశానికి కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డితోపాటు ఆర్‌ఓలు, ఆర్డీఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, అనుమతి లేకుండా ప్రైవేటు స్థలాల్లో ఉన్న రాజకీయ ప్రకటనల పోస్టర్లు, బ్యానర్లను తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యం లో అన్నిశాఖల అధికారులు మరింత బాధ్యతగా పని చేయాలని సూచించా రు. రాజకీయ పార్టీల బ్యానర్లు, స్టిక్కర్లు, పోస్టర్లు, ఫొటోలు, హోర్డింగులు తక్షణమే తొలగించాలన్నారు.

ఉష్ణోగ్రతలు (ఆది)

గరిష్ఠం : 40.0

కనిష్ఠం : 25.0



రంజాన్ వేళలు

ఇఫ్తార్	: సోమవారం సాయంత్రం 06:32
సెహరీ	: మంగళవారం ఉదయం 05:08


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు




ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు



ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..


జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..





అమ్మకానికి దేవుడి సేవలు..!

ఉభయదారులు ఉండగానే... గుట్టు చప్పుడు కాకుండా ప్రజాగరుడ సేవ మాజీ చైర్మన్‌కు కేటాయింపు

వైసీపీ నాయకుడి సిఫార్సుతోనే...?

కదిరి, మార్చి 17: ఆధ్యాత్మిక చింతన, భక్తి భావంతో చేసే దేవుడి సేవల్లో కూడా రాజకీయం మొదలు పెట్టారు. పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగే వాహనసేవలకు ఉభయదారులు అనాదిగా ఉంటున్నారు. వందల సంవత్సరాల నుంచి వారసత్వంగా ఆ సేవలు వారి కుటుంబీకులే చేస్తున్నారు. అటువంటి సేవలు నేడు అమ్మకానికి పెట్టినట్లు భక్తులు వాపోతున్నారు. దేవుడి సేవలనే అమ్మకానికి పెట్టడం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. మూడో కంటికి తెలియకుండా స్వామి సేవను కేటాయించడంపై అనేక అనుమానాలు భక్తులు లేవనెత్తుతున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రజాగరుడ సేవ ఒకటి. అత్యంత ప్రాశస్త్యం ఉంది. ఈసేవను వానవోలుకు చెందిన బంగారు ఆదిమూర్తప్పతోపాటు ఆయన కుటుంబీలు చేస్తున్నారు. అయితే అనివార్యకారణాలతో ఆయన వారసులు ఆ సేవను తాత్కలికంగా చేయలేమంటూ రాత పూర్వకంగా రెండు సంవత్సరాల కిందట రాసినట్లు తెలిసింది. ఆ తరువాత జరిగిన రెండు బ్రహ్మోత్సవాల్లో ఆలయం తరపునే ఉభయదారులుగా చేస్తున్నారు. అయితే ఆ సేవను ఇటీవలే టెంపుల్ మాజీ ఛైర్మన్ కాంబోజీ రెడ్డెప్ప శెట్టికి కేటాయించినట్లు బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికల్లో వేశారు. విషయం తెలుసుకున్న వానవోలు వారసులు ఆలయ ఈఓ వద్దకు వచ్చి తామే సేవను కొనసాగిస్తామని చెప్పినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఈ సేవను దక్కించుకోవడానికి రాజకీయ సిఫార్సుతోపాటు మరి కొంతమంది లక్షలు రూపాయలు ధారపోసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమ్మకానికి దేవుడి సేవలా అంటు భక్తులు చర్చించుకుంటున్నారు.

ఉభయదారులు ఉండగానే...

ప్రజాగరుడ సేవను చేసే ఉభయదారులు వానవోలు వారసులు ఇంకా ఉన్నారు. వారసుల్లో కొంతమంది మాత్రమే సేవను అనివార్య కారణాల వల్ల చేయలేమని రాసిచ్చారని, దాయాదులు ఉన్నామని మేము స్వామి వారి సేవ సేయడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. తాము లిఖిత పూర్వకంగా రాసిచ్చినా ఈఓ పట్టించుకోలేదని వారు అంటున్నారు. ఈసేవ కోసం తాము కోర్టు వరకు అయినా వెళ్లడానికి సిద్ధమని చెబుతున్నారు. తమకు అనుకోని ఇబ్బందులు రావడం వల్ల స్వామి వారి సేవ చేయలేకపోయామని అంతమాత్రాన ఇతరులకు ఏలా కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ప్రజాగరుడ సేవను కేటాయించడంపై ఈఓ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు అంటున్నారు.



2024 సంవత్సరంలో ప్రజాగరుడ సేవను రెడ్డెప్పశెట్టికి కేటాస్తూ ముద్రించిన పోస్టర్

గుట్టుచప్పుడు కాకుండా...

స్వామి వారి సేవలు కేటాయించే సమయంలో భక్తులకు తెలియజేయాల్సి ఉంది. దీనిపై విస్తృత ప్రచారం చేస్తే దేవుడి సేవ చేయడానికి ఎంతో మంది భక్తులు ముందుకు వచ్చే వారు. అలా కాకుండా ఆలయ ఈఓ ఇష్టారాజ్యంగా వ్యవహరించారని భక్తులు అంటున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ప్రజాగరుడ సేవను టెంపుల్ మాజీ చైర్మన్‌కు కేటాయించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దేవుడి సేవను అధికారులు అమ్ముకున్నారని ఆరోపిస్తున్నారు. లక్షల్లో చేతులు మారయని అంటున్నారు. రెండు సంవత్సరాల నుంచి ఆలయం నిర్వహించి ఇప్పుడు ఎవరికీ తెలియకుండా స్వామి వారి సేవను కేటాయించడంలో మతలబు ఏంటని ప్రశ్నిస్తున్నారు. స్వామి వారి ఆలయ అభివృద్ధికిపాటు పడే వారికి ఆ సేవను కేటాయించి ఉంటే బాగుండేదని భక్తులు చెబుతున్నారు.

రాజకీయ సిఫార్సుతోనే జరిగిందా ?

ప్రజాగరుడ సేవ ఉభయదారుల మార్పు రాజకీయ సిఫార్సుతోనే జరిగిందా అని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రజాగరుడ సేవను దక్కించుకున్న టెంపుల్ మాజీ చైర్మన్ రెడ్డెప్పశెట్టి వైసీపీతో సన్నిహితంగా ఉన్నారు. ఈ కారణంగానే ఆయనకు టెంపుల్ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారని భక్తులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రజాగరుడ సేవను కేటాయించడానికి కూడా ఇటీవల వైసీపీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ నియోజవర్గస్థాయి నాయకుడి సిఫార్సు మేరకు ఆ సేవ కేటాయించినట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. దీంతో అధికారులు తమకు అందినంత పుచ్చుకొని ఈ సేవను కేటాయించినట్లు భక్తులు చెబుతున్నారు.

దేవస్థానాల్లో వారసత్వ హక్కు రద్దు

దేవస్థానాల్లో వారసత్వ హక్కు రద్దు చేశారు. 1987లో ఏపీస్టేట్‌లో దేవదాయ చట్టం ద్వారా దేవస్థానాల్లోని అన్ని వారసత్వ హక్కులను రద్దు చేశారు. ఈ మేరకు ప్రజాగరుడ సేవను చేయలేమని ఉభయదారులు స్వచ్ఛందంగా విరమించుకున్నారు. దీంతో ఈ సేవను 2024 సంవత్సరంలో చేసేందుకు టెంపుల్ మాజీ ఛైర్మన్ కాంబోజీ రెడ్డెప్పశెట్టికి కేటాయించాం. 20 సంవత్సరాలుగా దసరా ఉత్సవాల్లో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఈ సంవత్సరం అవకాశం ఇచ్చాం. స్వామివారి సేవలు కేటాయించడం ఈఓ ఇష్టం.

- శ్రీనివాస రెడ్డి, కార్యనిర్వహణాధికారి, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, కదిరి

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష


పరీక్షా కేంద్రం వద్ద రూమ్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం టౌన్, మార్చి 17: జిల్లాలో గ్రూప్-1 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 33 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అభ్యర్థులను పరిశీలించి కేంద్రాల్లోకి అనుమతించారు. నిముషం ఆలస్యమైనా నో ఎంట్రీ నిబంధన ఉండడంతో అభ్యర్థులు అరగంట ముందే కేంద్రాల వద్దకు చేరుకోవడం కనిపించింది. మరోవైపు పరీక్షా కేంద్రాలను పలువురు డీఎస్పీలు. జిల్లా అధికారులు తనిఖీ చేశారు. కాగా గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ గౌతమి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనతో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 11, 597మందికి గాను 7,542మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. 4,055 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరిగిన పరీక్షకు 7, 459మంది అభ్యర్థులు హాజరుకాగా 4,138 మంది గైర్హాజరు అయ్యారని కలెక్టరు వెల్లడించారు. ఉదయం 65.03శాతం, మధ్యాహ్నం 64.32శాతం అభ్యర్థులు హాజరయ్యారన్నారు.

రథం తయారీలో స్వాహాకు స్కెచ్?

సోషల్ మీడియాలో వైరల్

అనంతపురం, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మడలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ రథం తయారీలో స్వాహా పర్వానికి ఓ మాజీ ప్రజాప్రతినిధి తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రెండేళ్ల నుంచి రథం తయారీ అంశం నడుస్తూ ఉంది. గతంలో రూ.1.70కోట్ల అంచనాతో రథం తయారీకి ప్రతిపాదనలు పంపారు. భక్తుల నుంచి విరాళాల సేకరణ ఆలస్యం కావడంతో రథం తయారీ ఆగిపోయింది. గతేడాది ఉత్సవాల సందర్భంగా స్వామి రథం కుప్పకూలి ధ్వంసమైంది. అధికారులు అప్పట్లో తాత్కాలిక రథంతో ఉత్సవాలు నిర్వహించారు. రానున్న మే నెలలో రథోత్సవం ఉన్నందున అప్పటికి రథం తయారయ్యేది ప్రశ్నార్థకమే. అధికారులు మాత్రం హడావుడిగా ఈనెల 27వ తేదీన రథం తయారీ పనులు ప్రారంభించారు. రూ.2.30 కోట్ల అంచనాతో పనులకు శ్రీకారం చుట్టారు. అందులో దేవస్థానం నిధులు రూ.1.35 కోట్లు, భక్తుల నుంచి సేకరించిన విరాళాల సొమ్ము రూ.98లక్షలతో కలిపి రూ.2.30కోట్లు అంచనాలు సిద్ధం చేశారు. నిధులను స్వాహా చేసేందుకు అధికారులు, అధికార పార్టీ నాయకులు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఆ టెండర్‌ను అనంతపురానికి చెందిన కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. ఆ కాంట్రాక్టర్ స్థానిక ఆచారులతో రూ.1.38 కోట్లతో రథం తయారు చేసేలా అగ్రిమెంట్ కుదుర్చుకున్నట్లు కొన్నిపత్రాల ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. టెండర్ వేయడానికి సెక్యూరిటీ డిపాజిట్ కూడా ఆచారులే చెల్లించినట్లు సమాచారం. ఈ లెక్కన దాదాపు రూ.కోటి ప్రధాన కాంట్రాక్టర్‌కు మిగలనున్నట్లు చర్చ సాగుతోంది. దీనిపై ఆలయ ఈఓ విజయ్‌కుమార్‌ను అడగ్గా.. అక్రమాల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చినవన్నీ అవాస్తవాలేనన్నారు. రూ.1.78 కోట్లకు కాంట్రాక్టరుకు టెండరు అప్పగించామన్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈఓగా రమణారెడ్డి

అనంతపురం విద్య, మార్చి 17: జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈఓగా రమణారెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ జడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న లలితాబాయిపై గతంలో అనేక ఆరోపణలు రావడం, జడ్పీపాలక వర్గం ఆమెను సరెండర్ చేయాలంటూ ఇటీవల స్టాండింగ్ కమిటీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. రోడ్డుపైకి వచ్చి జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓకు వ్యతిరేకంగా జడ్పీ ఛైర్‌పర్సన్, జడ్పీటీసీలు నినాదాలు చేశారు. ఆమెపై చర్యలు తీసుకోకుంటే జడ్పీ స్టాండింగ్ కమిటీకి, సర్వసభ్య సమావేశానికి కూడా హాజరు కాబోమంటూ హెచ్చరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జడ్పీలో స్టాండింగ్ కమిటీ సమావేశం కూడా నిర్వహించలేదు. ఈనేపథ్యంలో ఎట్టకేలకు జడ్పీ డిప్యూటీ సీఈఓగా డ్వామాలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రమణారెడ్డిని నియమించారు. అదేవిధంగా లలితా బాయిని గుంతకల్లు డీఎల్‌డీఓగా నియమించారు. ఇద్దరిని డిప్యూటేషన్ బేసిస్‌పై నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఈనెల 12న ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఆ ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. రమణారెడ్డికి గతంలో కూడా డిప్యూటీ సీఈఓగా కొంతకాలం పనిచేసిన అనుభవం ఉంది.

నేటి నుంచి ఒంటిపూట బడులు

అనంతపురం విద్య, మార్చి 17: పాఠశాలలకు సోమవారం నుంచి మార్నింగ్ స్కూల్స్ నిర్వహించనున్నారు. మండుతున్న ఎండలు, వడగాలుల నేపథ్యంలో విద్యాశాఖ ఒంటిపూట బడులు నిర్వహించనుంది. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు మార్నింగ్ స్కూల్స్ ఉండనున్నాయి. పదో తరగతి పరీక్షలు జరిగే కేంద్రాలున్న స్కూళ్లలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూళ్ల నిర్వహణ ఉంటుంది.

రాజీనామా చేయండి.. ప్రచారంలో పాల్గొనండి..

మీ ఉద్యోగాలకు ఢోకాలేదు: వలంటీర్లకు వైసీపీ నేతల భరోసా

బొమ్మనహాళ్, మార్చి 17: 'వైసీపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రచార కార్యక్రమంలో చురుకుగా పాల్గొనండి.. మీపై పత్రికల్లో వార్తలు వచ్చి అధికారులు మందలిస్తే రాజీనామాలు చేస్తున్నామని నామమాత్రపు పత్రాలు ఇవ్వండి.. మీ రాజీనామాలు ఆమోదం కాకుండా మీ ఉద్యోగానికి ఢోకా లేకుండా అధికారులతో మేము మాట్లాడుకుంటాం..' అని వైసీపీకి చెందిన కొందరు ముఖ్యనాయకులు వలంటీర్లకు హుకుం జారీచేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వైసీపీ ప్రచార కార్యక్రమాలలో కొందరు వలంటీర్లు పాల్గొంటుండడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వస్తుండడంపై ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు ఈ విధంగా చెప్పినట్లు సమాచారం. నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా వైసీపీ సేవలో కొందరు వలంటీర్లు మునిగి తేలుతున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని కొన్ని గ్రామాల్లో వలంటీర్లు బరి తెగించి వైసీపీ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. వలంటీర్ల ప్రచారంలో పాల్గొంటున్నా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఎన్నికల ముందు భూమిపూజలా..!

ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డా.. లేక చందునా ..?: టీడీపీ

రామగిరి, మార్చి 17: ఎన్నికల కోడ్ రావడానికి కొన్ని గంటల ముందు శనివారం ముత్యాలంపల్లి, పెద్దయ్యగారి కొట్టాల, గంగంపల్లిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి సోదరుడు చందు భూమి పూజ చేయడం విడ్డూరంగా ఉందని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ... రాప్తాడుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డా లేదా ఆయన సోదరుడు చందునా అని వారు ప్రశ్నించారు. ఐదు సంవత్సరాలు నిద్రపోయి... ఇప్పుడు అభివృద్ధి పనులకు భూమిపూజ అంటూ ఎమ్మెల్యే సోదరులు ఓట్ల కోసం చేస్తున్న జిమ్మిక్కులు ఇక చెల్లవన్నారు. ఐదేళ్లలో రోడ్ల గుంతలు పూడ్చేందుకు పట్టెడు మన్ను వేయలేదు. ఇప్పుడు రోడ్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. గతంలో అభివృద్ధి పనులకు చేసిన భూమి పూజలు, శంకుస్థాపనలు గుర్తున్నాయా అని ప్రశ్నించారు. వాటి గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా... కోడ్‌కు గంటల ముందు ఎమ్మెల్యే సోదరులు చేసే భూమి పూజలను నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. ఈ ఐదేళ్లూ అక్రమాలు, దౌర్జన్యాలే తప్పా. కనీసం స్వగ్రామానికి కూడా రోడ్డు వేయలేకపోయామని, రానున్న ఎన్నికల్లో ఇక వైసీపీ ఓటమి తప్పదని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తి నాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, మాజీ ఎంపీపీ పరందామ యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు పేపర్‌శీన, నాగేశ్, సురేశ్, నాగరాజు, గంగిరెడ్డి, మనోహర్, పోతన్న, నర్రావెంకటేశ్, మారెన్న పాల్గొన్నారు.

వైసీపీలో బీసీలకు అన్యాయం


మీడియాతో మాట్లాడుతున్న ఆవుల కృష్ణయ్య

అనంతపురం అర్బన్, మార్చి 17: జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల కేటాయింపులో బీసీలకు తీరని అన్యాయం చేశారని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీలందరూ తన బిడ్డలంటూ సీఎం జగన్ మాయమాటలు చెబుతూ అనంత జిల్లాలో ఒక ఎమ్మెల్యే స్థానాన్ని మాత్రమే కేటాయించడం దుర్మార్గమన్నారు. టీడీపీలో మొదటి నుంచి బీసీలకు అన్ని విధాలుగా పెద్ద పీట వేస్తూ వస్తున్నారన్నారు. రాజకీయంగా బీసీలకు అవకాశం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన జగన్‌కు రాబోవు ఎన్నికల్లో బీసీలంతా ఏకమై ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓబుళపతి, కురబ నారాయణస్వామి, చౌడయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

వైసీపీవి నీచ రాజకీయాలు

టీడీపీని వీడే ప్రసక్తే లేదు : చిదానందనాయుడు


పెరవలిలో విలేకరులతో మాట్లాడుతున్న చిదానందనాయుడు

శింగనమల, మార్చి 17: తాను టీడీపీని వీడి.. వైసీపీలో చేరినట్లు ఆ పార్టీ సోషల్ మీడియా ద్వారా నీచ రాజకీయాలకు పాల్పడుతోందని పెరవలి గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు పుచ్చకాయల చిదానందనాయుడు మండిపడ్డారు. ఆదివారం ఆ గ్రామంలో ఆయన తన అనుచరులతో కలిసి.. మీడియాతో మాట్లాడారు. టీడీపీ ఆర్భావం నుంచి పనిచేస్తున్నామని, పార్టీ కోసం ప్రాణాలైనా ఇస్తామని, బండారు శ్రావణిశ్రీ గెలుపు ధ్యేయంగా పనిచేస్తామని తేల్చిచెప్పారు. కేవలం టీడీపీ నుంచి తనను దూరం చేయాలని ఉద్దేశంతోనే వైసీపీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా బండారు శ్రావణిశ్రీ గెలుపును ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో రామునాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లివర్ వ్యాధి బాధితుడికి 'అమ్మ' చేయూత


చెక్కు అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్, మార్చి 17: పుట్టుకతోనే పాక్షికంగా అంధత్వం కలిగిన నారాయణ లివర్ వ్యాధితో బాధపడుతుండడంతో అమ్మ సంస్థ చేయూత నందించి అండగా నిలిచింది. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన నారాయణ తన మేనమామకు చెందిన టీస్టాల్‌లో గ్లాసులు కడుతుగూ జీవిస్తున్నాడు. అనుకోకుండా ఒకరోజు కడుపునొప్పి రావడంతో డాక్టర్‌ను సంప్రదించగా లివర్ దెబ్బతినిందని, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరమని, అందుకోసం రూ.15 లక్షలు ఖర్చవుతుందని సూచించారు. దీంతో నారాయణకు చెందిన 2.5 సెంట్ల స్థలాన్ని విక్రయించగా రూ.10 లక్షలు వచ్చింది. మిగిలిన డబ్బు కోసం దాతల నుంచి సాయం కోరుతుండగా.. అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి స్పందించారు. ఆదివారం రూ.3లక్షల చెక్కును నారాయణకు అందజేశారు. మిగిలిన సొమ్మును కూడా తన సన్నిహితుల ద్వారా సమకూరుస్తానని హామీ ఇచ్చారు.

విద్యుత్ స్తంభం విషయంలో ఘర్షణ: బైక్‌కు నిప్పు


దగ్ధమైన బైక్

నార్పల, మార్చి 17: మండలంలోని గూగూడులో విద్యుత్ స్తంభం విషయంలో రెండు కుటుంబాలు ఆదివారం ఘర్షణ పడ్డాయి. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన నల్లప్ప, అతని కుమారుడు రామాంజినేయులుకు.. అదే గ్రామానికి చెందిన పూజారి, పెద్ద రాజన్న పొలం వద్ద ఉన్న విద్యుత్ స్తంభం విషయంలో గొడవపడ్డారు. ఈ గొడవలో నల్లప్ప, రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. అంతేకాకుండా నల్లప్పకు చెందిన ద్విచక్రవాహనాన్ని దహనం చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం

టీడీపీ, జనసేన, బీజేపీ శింగనమల ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ


ఉల్లికల్లులో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న బండారు శ్రావణిశ్రీ, నాయకులు

శింగనమల, మార్చి 17: రాష్ట్రం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని శింగనమల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావే శంలో ఆమె మాట్లాడారు. నియోజక వర్గంలో అందరు ఐక్యతతో కృషి చేస్తేనే అది సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆదినారాయణ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, ఉల్లికల్లు రంగారెడ్డి, మారుతినాయుడు, ఈశ్వరరెడ్డి చితం బరిదొర, గుర్రం లక్ష్మినారాయణ, రామవ రెడ్డి, జీసీ బాబు. చంద్రాయడు, రాజు, త్రిలోకనాథ్, వెంకటరాముడు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: చెన్నేకొత్తపల్లి మండలంలోని గంగినేపల్లి పంచాయతీలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ శ్రేణులు ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే రామగిరి మండలంలోని పేరూరులో, ఆత్మకూరు మండలంలోని మదిగుబ్బలో, కనగానపల్లి మండలంలో తగరకుంట, పుల్లయ్యకుంటతండా గ్రామాల్లో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.









వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చాలి


సమావేశంలో పాల్గొన్న వాల్మీకి బోయ సంఘం నాయకులు

అనంతపురంరూరల్,మార్చి 17: వాల్మీకులను గిరిజన జాబితాలోకి చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రుద్రంపేటలోని ఆ సంఘం కార్యాలయం నుంచి పవర్ ఆఫీస్ వాల్మీకి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. బోయలను గిరిజన జాబితాలో చేర్చే వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల శ్రీనివాస్, అమరావతి ఆస్పత్రి ఎండీ అంకే ముత్యాలన్న, సతీష్‌కుమార్, ఈశ్వర్ మోపూరి, బోయ రామయ్య, అక్కులప్ప, మండల నగేష్, ఎర్రిస్వామి, పోతులయ్య, కేశవ, గోవింద్, నాగార్జున, అఖిల్ పాల్గొన్నారు.

కురుబ యువజన సంఘం ఎన్నిక


నూతన సంఘ సభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 17: నగరంలోని కనకదాస బాలికల వసతి గృహంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కురుబ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా చిత్రా నాగారాజు గౌడ్, గౌరవాధ్యక్షుడిగా ఆర్వేటి నారాయణస్వామి, ఉపాధ్యక్షుడిగా బండి అరుణ, శివ రుద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా బనగాని కాటమయ్యలను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు కొనకొండ్ల రాజేష్, పిడుగు కృష్ణమూర్తి, ఎల్ఐసీ వెంకటేష్, వలిగొండ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎద్దుల బండిని ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

చెన్నేకొత్తపల్లి, మార్చి 17: మండలంలోని ఎర్రంపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఓ ఎద్దుల బండిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతుతో పాటు ఓ ఎద్దు కూడా గాయపడింది. చెన్నేకొత్తపల్లికి చెందిన రైతు నారాయణరెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం తెల్లవారుజామున ఎద్దులబండిలో బయలుదేరాడు. ఎర్రంపల్లి సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఎద్దుల బండి నుజ్జునుజ్జైంది. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని పోలీసులు తెలిపారు.

పశువుల సంత ఆదాయం రూ.3.41 లక్షలు

అనంతపురంరూరల్,మార్చి 17: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,41,670 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,68,790, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,72,880 ఆదాయం వచ్చిందన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె, మార్చి 17 : మండలంలోని కనుంపల్లి వద్ద ఆదివారం మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. చిత్రచేడు, నిదనవాడ గ్రామాల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా.. పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

అనంతపురం కల్చరల్, మార్చి 17: స్థానిక జేవీవీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మూర్ఛవ్యాధి వైద్య శిబిరానికి భారీ స్పందన వచ్చింది. 106 మంది ఇందులో వైద్యపరీక్షలు, చికిత్స పొందారు. శిబిరానికి జేవీవీ నగరాధ్యక్షుడు రామిరెడ్డి, కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ.. మందులు వాడడంతో పాటు తగిన జాగ్రత్తలు పాటించాలని బాధితులకు సూచించారు. శిబిరంలో పాల్గొన్న బాధితులకు రెండు నెలలకు సరిపడా మందులను అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, రాధాకృష్ణ, ఎర్రిస్వామి, శివచరణ్, నూర్ మహమ్మద్, నందకిశోర్ పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం

శింగనమల,మార్చి 17: మండలంలోని కల్లుమడి గ్రామానికి చెందిన రామలింగేశ్వరా ఆలయానికి మండల జనసేన కన్వీనర్ తోట ఓబిలేసు రూ. 10 వేలు విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని ఆదివారం ఆ ఆలయ కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు.

గ్రూప్-1 పరీక్షా కేంద్రాల తనిఖీ


గ్రూప్-1 పరీక్షా కేంద్రంలో కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం క్రైం, మార్చి 17: ఏపీపీఎస్సీ ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను జిల్లా కోఆర్డినేటింగ్ అధికారి, నగర కమిషనర్ మేఘ స్వరూప్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. గుత్తిరోడ్డులోని శ్రీ సాయి నర్సింగ్ కళాశాల, బుక్కరాయసముద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను ఆయన పరిశీలించారు.ఆయన వెంట పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజనింగ్ అధికారులు ఉన్నారు.

అర్బన్ బ్యాంకు మహాజనసభ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 17: స్థానిక సుభాష్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయభవన్‌లో అర్బన్ బ్యాంకు 108వ మహాజనసభను ఆదివారం నిర్వహించారు. ఇందులో ఆ బ్యాంకు ఛైర్మన్ జేఎల్ మురళీధర్, మొదట బ్యాంకు సీఈఓ విజయభాస్కర్ మాట్లాడుతూ... టౌన్ బ్యాంకును రూ.70కోట్ల టర్నోవర్‌తో దివాలా స్థాయి నుంచి అర్బన్ బ్యాంకుగా రూ.700 కోట్ల టర్నోవర్‌తో పరణితి సాధించే స్థాయికి తీసుకురావడం శుభపరిణామమన్నారు. బ్యాంకు మరింత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు వైస్ ఛైర్మన్లు వడ్డే వెంకటాద్రి, బంగారు బాషా, డైరెక్టర్లు రామాంజి నేయులు, రొళ్ల భాస్కర్, విజి సుబ్రమణ్యం, రమణయ్య, చంద్రశేఖర్, చింతా భాస్కర్, ఉద్యోగులు, ఖాతాదారులు, డిపాజిటర్లు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జేఎల్ మురళీధర్

ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో పేరెంటింగ్ సెషన్


అశ్లేషను సన్మానిస్తున్న పాఠశాల బృందం

అనంతపురంరూరల్, మార్చి 17: మండలంలోని కొడిమి గ్రామ సమీపంలోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో పేరెంటింగ్ సెషన్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి, డాక్టర్ అశ్లేష హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. పిల్లల సామర్థ్యం ఎంత ఉందో తెలుసుకొని ప్రత్యేక శిక్షణ ఇచ్చి లక్ష్యం వైపు నడిపించాలన్నారు. విద్యార్థుల మార్కులను ఇతరులతో పోల్చకుండా వారిని మంచి మార్కులు సాధించే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఏఓ దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో వైద్య శిబిరం


ఆలయంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న రియా ఆస్పత్రి సిబ్బంది

ఆత్మకూరు, మార్చి 17: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం రియా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుబ్రమ్మణ్యేశ్వర స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో వైద్యశిబిరంలో వైద్య చికిత్సలు చేయించుకున్నారు. వైద్యాధికారులు మోదుపల్లి ఉదయ్‌కుమార్,వైద్యసిబ్బందితో వైద్యసేవలు అందించారు. బీపీ, షుగర్... తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రియా మేనేజింగ్ డైరెక్టర్ మోదుపల్లి లక్ష్మీప్రసాద్, సీఈఓ మురళీ, కృష్ణ, కార్యనిర్వహణాధికారి శోభ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంకె రామలింగయ్యకు పురస్కారం


పురస్కారం అందుకుంటున్న అంకె రామలింగయ్య

అనంతపురం కల్చరల్, మార్చి 17: కందుకూరుకు చెందిన సాహితీవేత్త డాక్టర్ అంకె రామలింగయ్య గుర్రం జాషువా కళాభూషణ్ జాతీయ పురస్కారం అందుకున్నారు. మహాబోధి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దాసన్నగారి కృష్ణమూర్తి అధ్యక్షతన జెడ్పీ హాల్‌లో ఆయను ఆ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమానికి జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, బళ్లారి వీరశైవ కళాశాల విశ్రాంత తెలుగు విభాగాధిపతి ఆచార్య రాచేపల్లి దేవన్న ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో లలితకళాపరిషత్ అధ్యక్షుడు గాజుల వెంకట సుబ్బయ్య, సాహితీవేత్త డాక్టర్ పతికి రమేష్ నారాయణ, జక్కుల శ్రీనివాసరావు, చంద్రాచర్ల హరి, బంగారు తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలకు శ్రీకారం


కలశపూజలు నిర్వహించిన దృశ్యం

అనంతపురం కల్చరల్, మార్చి 17: స్థానిక ప్రభుత్వాస్పత్రి రోడ్డులోని జ్ఞానసాగర దత్తాత్రేయస్వామి ఆలయ 36వ వార్షికోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణంలో యాగశాల ప్రవేశం, గణపతి వాస్తుహోమం, కలశపూజలు నిర్వహించారు. సోమవారం నిర్వహించనున్న వేడుకలకు గణపతి సచ్చిదానందస్వామి ప్రధాన శిష్యుడు దత్త విజయానంద తీర్థస్వామి హాజరవుతున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ శర్మ గోసాల వెల్లడించారు.

టెన్నిస్ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నాగరాజు బాబ్జీ ఏకగ్రీవం


నాగరాజు బాబు బాబ్జీ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 17: టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నాగరాజుబాబు బాబ్జీ ఎంపిక య్యారు. కాకినాడలో ఆదివారం నిర్వహించిన ఏపీ రాష్ట్ర లాన్ టెన్నిస్ సంఘం కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కమిటీ ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన న్యాయవాది, సీనియర్ టెన్నిస్ క్రీడాకారుడు నాగరాజు బాబు బాబ్జీను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లాకు చెందిన కోచ్ హరికిశోర్ రాష్ట్ర టెన్నిస్ సంఘం రెఫరీ కమిటీలో సభ్యుడిగా ఎన్నుకున్నారు.

రేపట్నుంచి రేణుకా యల్లమ్మ మహోత్సవాలు

అనంతపురం కల్చరల్, మార్చి 17: స్థానిక పాతూరులోని అంతరగంగప్పస్వామి ఆలయ ఆవరణంలోని చంద్రగుత్తి రేణుకా యల్లమ్మ దేవాలయంలో మంగళ, బుధవారాల్లో మహోత్సవాలను నిర్వహిస్తున్నామని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు బండి చంద్రశేఖర్ గౌడ్ పిలుపుని చ్చారు. ఆదివారం ఆలయ ఆవరణంలో ఉత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు కొత్త వెండికాగుతో అమ్మవారిని గంగపూజకు ఊరేగింపుగా తీసుకెళ్లడంతోపాటు రాత్రి 9.30 గంటలకు నగరోత్సవం నిర్వహిస్తా మన్నారు. బుధవారం తెల్లవారుజామున అమ్మవారి సాక పూజ, 7.30 గంటలకు మహామంగళహారతి నివేదన, 11 గంటలకు అన్నదానం నిర్వహిస్తా మన్నారు. జిల్లా నలు మూలలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కురుబలు పెద్ద సంఖ్యలో ఈ మహోత్సవాలకు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్ద బాలఓబన్న, చిన్న ఓబన్న, ఓబయ్య, నాగరాజు, ప్రసన్నకుమార్, పెద్ద ఓబులేసు, నరేష్, దీక్షిత్, పుల్లన్న, కౌషిక్, మునలన్న పాల్గొన్నారు.


ఉత్సవాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రబీలో 31 మండలాలనూ కరువుగా ప్రకటించాలి

అనంతపురం విద్య, మార్చి 17: జిల్లాలో అత్యంత కరువు పరిస్థితుల వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని రబీలో సైతం 31 మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 31 మండలాలు ఉంటే... రబీలో కేవలం 14 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. ఇది చాలా దారుణం అన్నారు. ప్రభుత్వం వెంటనే 31 మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించి, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా పావలా వడ్డీ, పంటనష్టపరిహారం రైతుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

ధర్మవరంరూరల్ : కనగానపల్లి మండలంలోని తగరకుంట గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. 32 సంవత్సరాల తర్వాత కలుసుకున్న ఆ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి గురువులను గోపినాథ్, సాయినాథ్, పాండురంగ, నాగిరెడ్డిలతో పాటు ప్రస్తుత ఉపాధ్యాయులు శివయ్య, రామప్పను సన్మానించారు. రూ.1.50 లక్షలతో వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా వీరాంజనేయస్వామి రథోత్సవం



వీరాంజనేయస్వామికి రథాన్ని లాగుతున్న భక్తులు

కుందుర్పి, మార్చి 17: కుందుర్పి మండల పరిధిలోని వడ్డీపాలెం గ్రామంలో వెలసిన గుడిబండ వీరాంజనేయస్వామి రథోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుడిబండ వీరాంజనేయస్వామి రథోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుడిబండ వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు రథోత్సవం ముందు పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున రథోత్సవానికి పూలహారాలు సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం వేలాదిమంది భక్తుల మధ్య రథోత్సవాన్ని ముందుకు లాగారు. రథోత్సవాన్ని గెలిపించడానికి కర్ణాటక, ఆంధ్ర దగ్గర ప్రాంతాల ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై స్వామి వారికే మొక్కులు తీర్చుకొన్నారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఐరావత వాహనంపై చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ, మార్చి 17: గవిమఠం స్థిత చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఐరావత వాహనంపై విహరించారు. ఆలయంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉత్సవమూర్తిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చారు. ఐరావతవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తిని మఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకు ఊరేగించారు. ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, ఆదోని చౌకిమఠం కల్యాణ్‌స్వామి, గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంటు రాజన్నగౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

యాడికి, మార్చి17: యాడికిలోని లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు హరికృష్ణశర్మ, ఈఓ దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, కలశస్థాపన, 19న పుష్ప విమానోత్సవ సేవ, 20న సింహ వాహన సేవ, 21న శేషవాహనసేవ, 22న హనుమద్‌వాహన సేవ, 23న గరుడ వాహనసేవ, 24న గజేంద్రవాహనసేవ, 25న స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవం, 26న అశ్వవాహనం, పారువేట, 27న హంసవాహనసేవ, 28న శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

చెక్‌పోస్టుల తనిఖీ



గాలిమారెమ్మ గుడి వద్దనున్న చెక్‌పోస్టులో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

రాయదుర్గం/కళ్యాణదుర్గంరూరల్, మార్చి 17: కేంద్ర ఎలెక్షన్ కమిషన్ శనివారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు పలు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలోని కాదలూరు, మొలకాల్మూరు సరిహద్దులోని గాలి మారెమ్మ గుడి, హాలికల్లు గ్రామం వద్దనున్న చెక్‌పోస్టులను ఆదివారం పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు డీఎస్పీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో కర్ణాటక మద్యం తరలింపు కానీ, నగదును తరలిస్తున్నట్లు సమాచారం వస్తే అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. 24 గంటలు సీసీ కెమెరాల నిఘా వుంటుందని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి: చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఆర్డీవో రాణి సుష్మిత అన్నారు. ఆదివారం శెట్టూరు, అయ్యగార్లపల్లి చెక్‌పోస్టులను ఆమె సందర్శించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి వాహనాన్ని, అనుమానం వచ్చిన వ్యక్తులను తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్‌కు నోటీసులు

గుమ్మఘట్ట, మార్చి 17: మండలంలోని జే వెంకటంపల్లి గ్రామ వలంటీర్ శ్రీనివాసులు శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎంపీడీఓ గౌరీదేవి స్పందించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాల్సిందిగా పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ పరిధిలోని వలంటీర్లు ఇకపై ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కఠినచర్యలు తీసుకుంటామని కార్యదర్శి హెచ్చరించారు.

గుమ్మనూరును దీవించాలని ప్రచారం

గుత్తిరూరల్, మార్చి17: సార్వత్రిక ఎన్నికల్లో గుమ్మనూరు జయరాంను దీవించాలని ఆయన సోదరులు విస్తృత ప్రచారం చేశారు. మండలంలోని కరిడికొండ గ్రామంలో ఆదివారం పలువురు నాయకులను సంప్రదించారు. గుమ్మనూరు సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, కుమారుడు ఈశ్వర్ మాట్లడుతూ తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు సమ న్యాయం జరుగుతుందన్నారు. గుంతకల్లు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంను ప్రజలు ఆదరించాలని కోరారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు చేసుకుంటే మన రాష్ట్రం బాగుటుందన్నారు. టీడీపీ నాయకులు ప్రబాకర్ చౌదరి, క్రిష్ణయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు, మార్చి 17: మండలంలోని జూటూరు గ్రామానికి చెందిన నల్లయ్య కుటుంబానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. నల్లయ్యకు చెందిన పంక్చర్ దుకాణం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న అశ్మిత్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

సొంతవారికే కండువాలు వేసి వైసీపీలో చేరినట్లు గొప్పలా!

బొమ్మనహాళ్, మార్చి 17: వైసీపీ నాయకులు వారి కార్యకర్తలకే పార్టీ కండువాలు వేసి టీడీపీ నుంచి వచ్చినట్లు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని టీడీపీ నాయకులు అప్పారావు, గ్యాస్ గోవిందు అన్నారు. ఉద్దేహాళ్‌లో బండూరు, దేవగిరి గ్రామాలకు చెందిన టీడీపీ నుంచి వైసీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు చెప్పుకోవడం విచిత్రంగా ఉందని అన్నారు. మెట్టు గోవిందరెడ్డి సమక్షంలో వైసీపీ కండువాలు వేయించుకున్న వారు టీడీపీకి సంబంధమే లేదన్నారు. ధర్మపురి ఆంజనేయులు, చాకలి వన్నూరుస్వామి, సంజప్ప పాల్గొన్నారు.

కలిసికట్టుగా అమిలినేనిని గెలిపించుకుందాం

● టీడీపీ అభ్యర్థి కుటుంబ సభ్యుల పిలుపు

కళ్యాణదుర్గం, మార్చి 17: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకుందామని సురేంద్ర బాబు భార్య రమాదేవి, కుమారుడు యశ్వంత్, కోడలు ఇషిత పిలుపునిచ్చారు. ఆదివారం కళ్యాణదుర్గం మున్సిపాల్టీలోని కోట కాలనీ, సబ్ రిజిస్ట్రార్ కాలనీతో పాటు పలు కాలనీల్లో వారు ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దిశగా మనమందరం పార్టీని గెలిపించుకుందామని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే కుటుంబ భద్రతతో పాటు ఆర్థిక భద్రత వుంటుందన్నారు. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అభివృద్ధి బాటలో నడవాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యమన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు వచ్చిన సురేంద్రబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు మనమందరం కలసి కట్టుగా కృషి చేద్దామన్నారు. అలాగే శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో టీడీపీ పార్టీలోకి పలువురు చేరడంతో వారందరికీ యశ్వంత్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ కంచుకోట కళ్యాణదుర్గంలో అమిలినేని అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



మున్సిపాలిటీలో ప్రచారం చేస్తున్న అమిలినేని సురేంద్ర భార్య, కోడలు



అయ్యగార్లపల్లిలో టీడీపీ పార్టీలోకి చేరిన వారితో అమిలినేని యశ్వంత్

కాకర్ల విందుకు హాజరైన మున్సిపల్ చైర్మన్

● పార్టీలోకి రావాలంటూ జేసీపీఆర్ ఆహ్వానం

● త్వరలో నిర్ణయం ప్రకటిస్తామన్న కాకర్ల బ్రదర్స్



కాకర్ల బ్రదర్స్‌తో మాట్లాడుతున్న జేసీపీఆర్, జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి17: పట్టణంలోని టైలర్స్‌కాలనీలో ఉన్న కాకర్ల రంగనాథ, కాకర్ల జయుడు, మాజీ ఎంపీపీ కాకర్ల రంగనాయకులు ఇంటిలో ఇచ్చిన విందుకు టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరయ్యారు. జేసీపీఆర్ కాకర్ల బ్రదర్స్ ఎలా ఉన్నారంటూ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం వారితో జేసీపీఆర్ ఏకాంతంగా చర్చలు జరిపారు. జేసీపీఆర్ మాట్లాడుతూ 2014ఎన్నికల సమయంలో కీలకంగా పార్టీలో పనిచేసి విజయానికి కాకర్ల బ్రదర్స్ తోడ్పాటు అందించారన్నారు. కొన్ని కారణాల వల్ల మనమధ్య గ్యాప్ వచ్చిందని, గతంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లను మర్చిపోయి పార్టీ కోసం పనిచేయాలని కోరారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమని అందరం కలిసి అభివృద్ధి పనులను చేపడదామని పిలుపునిచ్చారు. స్పందించిన కాకర్ల బ్రదర్స్ ఆలోచించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు.

టీడీపీలో మరిన్ని చేరికలు?: కాకర్ల ఇచ్చిన విందుకు జేసీ ప్రభాకర్ రెడ్డి హాజరుకావడంతో త్వరలోనే కాకర్ల బ్రదర్స్ టీడీపీలో చేరతారంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వీరితోపాటు మరికొంతమంది ముఖ్యనేతలు చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎంఏ రంగారెడ్డి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. మరో ముఖ్య నేతతోపాటు ఆయన సోదరుడు చేరే అవకాశం ఉంది. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా తాడిపత్రికి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఇరువురు సోదరులు వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో పెద్దారెడ్డి విజయంలో కీలకంగా మారిన వీరు 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల తర్వాత వైసీపీకి దూరంగా ఉంటూ వచ్చారు. తాడిపత్రి వైసీపీ తరపున మొట్టమొదట అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసిన నంద్యాల జిల్లా వాసి అయిన వీఆర్ రామిరెడ్డి చేరిక దాదాపు ఖరారైందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పెద్దపప్పూరు మండలంలో వైసీపీలో కీలకంగా ఉన్న మరో ముఖ్యనేత కూడా చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



బొమ్మనహాళ్‌లో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, మార్చి 17: తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని క్లస్టర్ కన్వీనర్ మాలపాటి ధనుంజయ అన్నారు. మండల కేంద్రంతోపాటు, ఉద్దేహాళ్, హరేసముద్రం గ్రామాలలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు గెలిస్తే ప్రతి ఇంటికి సూపర్‌సిక్స్ పథకాలు అందుతాయన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాయదుర్గం ఎమ్మెల్యేగా కాలవ శ్రీనివాసులును గెలిపించాలన్నారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, నాయకులు నవీన్, పయ్యావుల మోహన్, పయ్యావుల నాగరాజు, మాజీ డైరెక్టర్ కొత్తపల్లి మహేంద్ర, మాజీ సర్పంచ్ పల్లి తిప్పేస్వామి, దివాకర్, దుర్గాప్రసాద్, సంగప్ప, కావలి ప్రభు, మున్నా, చాంద్‌బాషా, ఎల్‌ఐసీ శ్రీన పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకుడు తాతిరెడ్డి లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముచ్చుకోట గ్రామంలో ఆదివారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. బీసీ రామకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జేసీ శశిధర్ రెడ్డి, నారాయణస్వామి, మండల కన్వీనర్ రఘునాయుడు, వెంకటనారాయణరెడ్డి, కూచిసాయి మోహన్, రంగస్వామి, మండల క్లస్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, తాతిరెడ్డి బాబురెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నందలపాడు, జూటూరుకాలనీ, క్రిస్టియన్‌కాలనీల్లో ఆదివారం క్రైస్తవులు బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోను వివరించి కరపత్రాలను పంపిణీచేశారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేయాలని వారు ప్రజలను కోరారు. కౌన్సిలర్ విజయ్‌కుమార్, నాయకులు పావురాల శీనయ్య, దొరస్వామి, దేవపుత్ర, పుల్లయ్య, లచ్చి, అబ్రహం, జాన్సన్, సూరి పాల్గొన్నారు.





పెద్దపప్పూరు, తాడిపత్రిలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అభివృద్ధి బాటలో టౌన్‌బ్యాంక్



మాట్లాడుతున్న అబ్దుల్ జిలాన్

గుత్తి, మార్చి 17: వంద కోట్ల డిపాజిట్లతో అభివృద్ధి బాటలో టౌన్ బ్యాంక్ నిలచిందని బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్ పేర్కొన్నారు. పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ది గుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ మహాజన సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారుల సహకారంతోనే బ్యాంక్ అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. తమ బ్యాంక్‌లో షేర్ హోల్డర్లు 4357మంది, మూలధనం రూ.5.48కోట్లు, డిపాజిట్లు రూ.108కోట్లు ఉన్నాయన్నారు. బ్యాంక్‌కు రూ.15కోట్లు సొంత నిధి ఉందన్నారు. రూ.3.77కోట్లు బ్యాంక్ ఆదాయంలో ఉందన్నారు. బ్యాంక్‌లో రుణాలు తీసుకున్న ఖాతాదారులు రుణాలు చెల్లించడంలో సహకరిస్తున్నారన్నారు. బ్యాంక్ సీఈఓ మహేశ్వరప్రసాద్, ఉపాధ్యక్షుడు మోహన్, డైరెక్టర్లు నాగరాజు, ఎం కృష్ణ, మధుసూదన్‌గుప్త, వెంకటేష్, వీరన్న, మహేష్‌కుమార్, మాబు, ఖాజామైనుద్దీన్, రంగప్రసాద్, దాదా, సీ నాగరాజు, డీఓఎం చైర్మన్ సుధీర్‌బాబు, సభ్యులు శ్రీనివాసులు, వన్నప్ప పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్టలు, పెన్నుల పంపిణీ

పుట్లూరు, మార్చి17: మండలకేంద్రంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్‌లో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో వార్డెన్ శివారెడ్డి, రవి, సూరి, ఉమేష్ పాల్గొన్నారు.

అధికారులకు తప్పని కష్టాలు!



ట్రాక్టర్‌లో బెంచీలను తరలిస్తున్న దృశ్యం

యల్లనూరు, మార్చి 17: పదో తరగతి పరీక్షలు వచ్చాయంటే అధికారులకు బెంచీల కష్టాలు మొదలవుతాయి. మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫర్నిచర్ లేకపోవడంతో వాటిని సమకూర్చడానికి అధికారులు అష్టకష్టాలు పడ్డారు. పాఠశాలకు నాడు-నేడు కింద నాబార్డు నిధుల ద్వారా పనులు చేశారేగానీ ఫర్నిచర్ రాలేదు. ఇక్కడ విద్యార్థులకు బెంచీలు లేకపోవడంతో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న వారికోసం ప్రైవేట్ పాఠశాలల నుంచి తీసుకురావాల్సిన దుస్థితి నెలకొంది. సోమవారం నుంచి ప్రారంభంకానున్న పరీక్షల కోసం మల్లేపల్లి పాఠశాల నుంచి బెంచీలను తెచ్చారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

తాడిపత్రిటౌన్, మార్చి17: మండలంలోని గన్నెవారిపల్లికాలనీలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఘర్షణపడ్డ సంఘటనలో ఖాదర్, షెక్షావలిలు గాయపడినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని టైలర్స్‌కాలనీకి చెందిన ఖాదర్, షెక్షావలి, గన్నెవారిపల్లికిచెందిన నరేష్, అల్లీపీరా నలుగురు మిత్రులు. రాత్రి వారందరూ మద్యం తాగారు. బైక్‌లపై గన్నెవారిపల్లికాలనీలోని హీరోషోరూం సమీపంలో మద్యం మత్తులో గొడవపడ్డారు. దీంతో మాటమాటపెరిగి పక్కనే ఉన్న చికెన్‌సెంటర్‌లోని కత్తిని తీసుకున్న అల్లీపీరా ఖాదర్, షెక్షావలిలపై దాడి చేశాడు. గాయపడ్డ ఇద్దరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నకిలీ నాణేలు విక్రయించిన ముఠా అరెస్ట్

కూడేరు, మార్చి 17: భూమిలో బంగారం నాణేలు దొరికాయని, వాటిని విక్రయిస్తామని నమ్మించి నకిలీ నాణేలను అంటగట్టిన ముఠాను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. కర్ణాటక రాష్ట్రం అంతాపురం గ్రామానికి చెందిన నలుగురు స్నేహితులు ముఠాగా ఏర్పడి హైదరాబాద్‌కు చెందిన నరసింహాచారి అనే వ్యక్తిని ఫోన్‌లో పరిచయం చేసుకున్నారు. తమ వద్ద బంగారు నాణేలు ఉన్నాయని, వాటి విలువ లక్షల్లో ఉంటుందని నమ్మబలికారు. అతడి వద్ద నుంచి రూ.11 లక్షల వరకు డబ్బు వసూలు చేశారు. గతనెల 15వ తేదీన జల్లిపల్లి గ్రామ సమీపంలో చర్చి వద్ద నరసింహాచారి నుంచి డబ్బులు తీసుకొని నకిలీ బంగారు నాణేలను అందజేశారు. మోసానికి గురైనట్టు గుర్తించిన బాధితుడు ఈనెల 13న కూడేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నకిలీ నాణేల ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ముఠా సభ్యులైన భాస్కర్, రాంప్రసాద్, ధనుంజయ, తాతాయ్యలపై కేసునమోదు చేశారు. నకిలీ నాణేల సూత్రధారి భాస్కర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారి నుంచి కారు, రెండు సెల్‌ఫోన్లు, నకిలీ నాణేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీఐ శివరాముడు పర్యవేక్షణలో నకిలీ నాణేల ముఠా గుట్టు రట్టు చేశారు.



ముఠా సభ్యుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చంద్రబాబుతోనే రాష్ట్రానికి మనుగడ: జేసీపీఆర్



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న జేసీపీఆర్

పుట్లూరు, మార్చి 17: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే ఆంధ్రప్రదేశ్‌కు మనుగడ ఉంటుందని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం టీడీపీ మండల నాయకులతో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. చవ్వా కులశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, రామానాయుడు పాల్గొన్నారు.

భర్తపై గొడ్డలితో దాడి

ఉరవకొండ, మార్చి 17: మండలంలోని పెద్దముష్టూరు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం భర్తపై భార్య గొడ్డలితో దాడిచేసిన ఘటన చోటు చేసుకుంది. పెద్దముష్టూరుకు చెందిన ఓబులేశు మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవపడుతుండేవాడు. మద్యం కోసం డబ్బులివ్వాలని వేదిస్తుండటంతో సహనం కోల్పోయిన భార్య లలిత గొడ్డలితో దాడిచేసింది. ఈ దాడిలో భర్తకు తల, మెడకు గాయాలు అయ్యాయి. దాడి చేసిన అనంతరం ఆమె ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. గాయపడిన ఓబులేశును 108వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించాలని వైద్యులు సూచించారు. సీఐ సురేష్ ఆసుపత్రికి వచ్చి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

యువకుడి ఆత్మహత్య

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 17: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపల్ పరిధిలోని ముదిగల్లు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బోయ బాలకృష్ణ (29) కడుపునొప్పితో బాధపడేవాడు. ఈ క్రమంలో బళ్లారి, బెంగళూరు, అనంతపురం తదితర చోట్ల చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో ఆదివారం నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య చంద్రకళ, కుమార్తె స్మైలీ, కుమారుడు కార్తికేయ వున్నారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బొమ్మనహాళ్, మార్చి 17: మండల కేంద్రంలోని బళ్లారి-కళ్యాణదుర్గం రహదారిపై ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు కణేకల్లు మండలం అంబాపురం గ్రామానికి చెందిన గురు అనే వ్యక్తితో పాటు మరొకరు కలిసి బళ్లారి వైపు నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. బొమ్మనహాళ్ సమీపంలోని బళ్లారి రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని బళ్లారి విమ్స్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు. సంఘటనపై బొమ్మనహాళ్ పోలీసులను వివరణ కోరగా మాకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

బస్సులో బంగారం అపహరణ

గుత్తి, మార్చి 17: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి బ్యాగ్ నుంచి ఏడు తులాల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై బాధితురాలు జయలక్ష్మి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గుంతకల్లుకు చెందిన జయలక్ష్మి పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామానికి వెళ్లి తిరిగి శనివారం రాత్రి గుంతకల్లుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. గుంతకల్లులో దిగిన తరువాత తన బ్యాగ్‌లో ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి బోరున విలపించింది. ఆదివారం ఆమె చోరీపై గుత్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, మార్చి 17: రాయదుర్గం పట్టణంలోని శనిమహాత్ముని గుడి ఏరియాకు చెందిన నాగేంద్రనాయక్ అనే వ్యక్తి వద్ద నుంచి 96 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. అక్రమ మద్యాన్ని అమ్ముతున్నాడని సమాచారం సేకరించి దాడి చేసి అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 96 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు శ్రీనివాసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ఉరవకొండ, మార్చి 17: విడపనకల్లు మండలంలోని మాలాపురం గ్రామం లో లింగప్ప అనే వ్యక్తికి చెందిన గుడిసె ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అప్పటికే గుడిసెలోని వస్తువులన్నీ కాలిపోయాయి. రూ.4లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడి తెలిపాడు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

తాడిపత్రిటౌన్, మార్చి 17: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యల్లనూరు మండలానికి చెందిన టీడీపీ కార్యకర్త మోహన్‌నాయుడును ఆదివారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరాతీసి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండడంతో అక్కడి వైద్యులతో జేసీపీఆర్ ఫోన్‌లో ఉన్నత చికిత్స అందించాలని కోరారు.